ప్రజాపాలనను వినియోగించుకోవాలి



ప్రజాపాసలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచించారు. పట్టణంలోని ఆర్‌బీ నగర్ కాలనీలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆరు గ్యారంటీల కోసం ప్రభుత్వం సూచించిన విధంగా అర్హులైన వారు దరఖాస్తులు అందించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల లేకుండా అధికారులు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను కొనసాగించాలని ఆయన సూచించారు. అర్హులైన వారందరికి ప్రభుత్వం లబ్ధి చేస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు భారతమ్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ప్రధానోపాధ్యాయురాలు కె. శ్రీలత

అత్తాపూర్: విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్ నేర్పించడం జరుగుతుందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి డి. రామిరెడ్డి అన్నారు. స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌ల ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గురువారం రాజేంద్రనగర్ పట్టణం పరిధిలోని అత్తాపూర్ శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రైమరీ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థినీ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పరిశీలించి ఆ విద్యార్థికి కావాల్సిన శిక్షణ ఇప్పించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో 11 పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం కేలండర్ ఆవిష్కరణ



బీసీ సంఘం ఆధ్వర్యంలో నూతన కేలండర్ ఆవిష్కరణ

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని బీసీ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వెంకరమణ చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. విశ్వవిద్యాలయలో బీసీ సెల్ ఏర్పాటు చేస్తే బీసీ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని ఈ దిశగా బీసీ సెల్‌ను ఏర్పాటు చేయాలని బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు రిజిస్ట్రార్‌ను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటి రిజిస్ట్రార్ మహేశ్వర్, అధికారులు కుమారస్వామి, సత్యనారాయణ, భిక్షపతి ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ లోపం.. పింఛన్‌దారులకు శాపం



ఘాంసిమియాగూడలో ఆసరా పింఛన్ల కోసం గుమికూడిన లబ్ధిదారులు

శంషాబాద్ రూరల్: ఆసరా పింఛన్ దారులకు ఇబ్బందులు తప్పడంలేదు. నెట్‌వర్క్ సరిగా లేక పింఛన్ల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. మండలంలోని ఘాంసిమిగూడలో ప్రతి నెల పంపిణీ చేసే పింఛను డబ్బుల కోసం స్థానికులు అవస్థలు పడుతున్నారు. గురువారం మధ్యాహ్నం పంచాయతీ కార్యాలయం వద్ద ఆసరా పింఛను డబ్బుల పంపిణీ చేపట్టగా.. అక్కడ నెట్‌వర్క్ సరిగా లేక పంపిణీలో జాప్యం జరుగుతుంది. వీరందరూ గంటల కొద్ది అక్కడ నిరీక్షించక తప్పడంలేదు. ప్రతి నెలా ఇలాగే ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి కుస్తీ పోటీలు

అత్తాపూర్: సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పుల క్రమంలో నేటి యువత క్రీడలకు దూరం అవుతున్నారు. మెదడు మదనం తప్ప భౌతికపరమైన ఆటల పోటీలు, శారీక శ్రమ తక్కువై రకరకాల అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి అసోసియేషన్ గత 5 సంవత్సరాలుగ దంగల్ పోటీలను నిర్వహిస్తుంది. ఈ పోటీల్లో హైదరాబాద్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు పాల్గొంటున్నరు. ఇప్పటికే ఎంతోమంది జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ కుస్తీ పోటీలు నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. శుక్రవారం నుంచి జనవరి 7వ తేదీ వరకు వివిధ కేటగిరిలో ముగుస్తాయని సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి టోర్నమెంట్ ప్రెసిడెంట్, బీజేపీ చేవేళ్ల పార్లమెంటు ఇన్‌చార్జి నారగూడెం మల్లా రెడ్డి, ముఖ్య నిర్వాహకులు గోరిగ రాజు వెల్లడించారు. ఈ దంగల్‌లో యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారి ప్రతిభను చాటుకోవాలని వారు పిలుపునిచ్చారు.

హాకర్లను వేధించొద్దు



సెవన్‌తూమ్స్ చౌరస్తా వద్ద హాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సెవన్ తూమ్స్ చౌరస్తా వద్ద ఆర్మీ అధికారులు హాకర్లను అకారణంగా వేధిస్తున్నారని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ ఆరోపించారు. గురువారం ఆయనను తూమ్ చౌరస్తా వద్ద వారిని కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా హాకర్లు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. సెవన్ తూమ్స్ ఎదురుగా ఉన్న రక్షణశాఖ స్థలంలో విధులు నిర్వహించే సైనికులు తమ కూరగాయలు, ఇతర వస్తువులను రోడ్డుపై పారవేస్తూ.. నానా రకాలుగా వేధిస్తున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఓ వైపు ట్రాఫిక్ అధికారులు, మరోవైపు ఆర్మీ వేధింపులతో తమకు పూటగడవడం కష్టంగా మారిందన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఆర్టిలరీ సెంటర్‌లో కమాండెండ్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చినట్టు సమాచారం. టోలిచౌకి డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

పగలే.. వెలుగులు

- పట్టించుకోని అధికారులు
- విద్యుత్తును వృధా చేయొద్దంటున్న స్థానికులు



పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు



మైలార్‌దేవ్‌పల్లి: కాలనీలలో, బస్తీలలో పట్టపగలే వీధి లైట్లు వెలుగుతున్నాయి. విద్యుత్ పొదుపు చేయాలని అధికారులే వినియోగదారులకు తెలుపుతారు. వారు మాత్రం పొదుపు పాటించరు. రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని చాల చోట్ల పట్టపగలే విద్యుత్ లైట్లు వెలుగుతున్నాయి. అనేక చోట్ల ఆటోమెటిక్ ఆన్ ఆఫ్ టైమర్లు విధించినప్పటికి అవి పని చేయడంలేదని స్థానికులు అంటున్నారు. విద్యుత్ సిబ్బంది అవి పని చేస్తున్నాయా? లేదా? అని చూసేవారే లేరని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల వీధిలైట్లు పనిచేయడం లేదని ఫిర్యాదు చేస్తే వచ్చి చూసి సరిచేస్తారు కాని ఆన్‌ఆఫ్ గురించి ప్రజలు అడుగితే మాకు సంబంధంలేదు టైమర్ వాళ్లకు ఫిర్యాదు చేయాలని సిబ్బంది సమాదానం ఇస్తున్నారని స్థానికు అంటున్నారు. మధుబన్ కాలనీలో అనేక చోట్ల వీధిలైట్లు గత కొంత కాలంగా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. మధుబన్ కాలనీలో ఓ వీధిలో స్థంబాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి పోల్స్‌కు వీధి లైట్లు బిగించలేకపోవడం గమనార్హం. ఆ వీధిలో కాలనీ వాసులు స్వంతంగా డబ్బులు వేసుకొని మరి వీధి లైట్లు తీసుకువస్తే వాటిని బిగించాలని అనేక మార్లు జీహెచ్ఎంసీ సూపర్ వైజర్ మహేందర్ కు వినతి చేసిన పెడచేవిన పెడుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన వీధులలో లైట్లు నిరంతరం వెలుగకుండా సిబ్బందికి సరైన చూచనలు ఇవ్వాలని అధికారులను కోరుతున్నారు.

నిత్యం వెలుగుతూనే ఉంటాయి



ప్రతి నిత్యం కాలనీలో చాల చోట్ల వీధులైట్లు వెలుగుతనే ఉంటాయి. జీహెచ్ఎంసీ సిబ్బంది నిర్లక్ష్యగా వహిస్తున్నారు. సంబంధిత అధికారులు తగుచర్యలు తీసుకొవాలని కోరుతున్నాను.

– యం.వెంకటేష్, స్థానికులు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అలకాపూర్ టౌన్‌షిప్‌లో దరఖాస్తులను తీసుకుంటున్న చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ తదితరులు

మణికొండ: గత అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే క్రమంలో ఆరు గ్యారంటీల దరఖాస్తుల కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తు పత్రాలను వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామితో కలిసి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలో పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు ఎవరైనా దరఖాస్తు చేసుకోనివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు కె. లక్ష్మీనారాయణ, బి. పద్మారావు, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు జితేందర్, వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నార్సింగిలో దరఖాస్తులు తీసుకుంటున్న కౌన్సిలర్ శ్రీకాంత్‌రావు

నార్సింగిలో...

నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం 6వ, 17వ వార్డులలో జరిగిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో గురువారం కౌన్సిలర్‌లు పత్తి శ్రీకాంత్‌రావు, ఉషారాణిలు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు శనివారంలోపు దర ఖాస్తులు చేసుకోవాలని కోరారు.

మురుగునీటి సమస్యను పరిష్కరిస్తాం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లు, కాలనీలలో మురుగునీటి సమస్య అధికంగా ఉందని, వాటి పరిష్కారానికి పెద్ద ఎత్తున నిధులను ఖర్చుచేసి సమస్యను పరిష్కరిస్తామని 6వ వార్డు కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు అన్నారు. గురువారం రూ. కోటి నిధులతో చేపడుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ, సెవెన్‌హిల్స్‌ల మురుగునీరు వెళ్లేందుకు సరైన మురుగు కాలువలు లేక తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. సమస్యను పూర్తిగా నివారించేందుకు మూసీ నది వరకు పైప్‌లైన్ పనులను చేపడతున్నామన్నారు. రాబోయే మూడు నెలల్లో పనులు పూర్తి అయితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



మురుగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించిన కౌన్సిలర్ శ్రీకాంత్ రావు

శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

శంషాబాద్ రూరల్: శంషాబాద్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీధర్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను ఈఓడబ్ల్యూకు బదిలీ చేశారు. కొత్త ఇన్‌స్పెక్టర్‌గా ఎస్. శ్రీనాథ్ నియమితులయ్యారు. రాయదుర్గం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనాథ్ బదిలీపై రానున్నారు.

జంట మున్సిపాలిటీలకు నూతన టీపీఓ

మణికొండ: నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలకు కలిపి ఒకరినే టీపీఓగా రాష్ట్ర ప్రభుత్వం మణిహారికను నియమించింది. దాంతో ఆమె గురువారం రెండు మున్సిపాలిటీలలో పదవీ బాధ్యతలు చేపట్టారు. మణికొండలో గతంలో పనిచేసిన టీపీఓ రాకేష్‌ను జీహెచ్ఎంసీకి బదిలీ చేయగా నార్సింగిలో పనిచేస్తున్న పావనీరావు సెలవులో వెళ్లారు. దాంతో రెండు మున్సిపాలిటీలలో ఖాళీ ఏర్పడటంతో రెండింటికీ కలిపి మణిహారికను నియమించారని మున్సిపల్ అధికారులు తెలిపారు. ఆమె మణికొండలో సోమ, మంగళ, బుధవారాలు, నార్సింగిలో గురు, శుక్ర, శనివారాలు విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

కెనరీ ద స్కూల్ వార్షికోత్సవం

మాదాపూర్: చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో బుధవారం రాత్రి కెనరీ ది స్కూల్ 8వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆదిలక్ష్మి చింతలపాటి హాజరై ప్రసంగించారు. చిన్నారులకు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యార్థులు సహజవనరుల పరిరక్షణపై నాటకం వేశారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ అరవింద్‌రెడ్డి, చైర్‌పర్సన్ శ్వేతారెడ్డి చప్పిడి, ప్రిన్సిపల్ లిడియా క్రిస్టీనా, అడ్మిన్ మేనేజర్ మహేష్ అక్కం, పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ అయోధ్య అక్షింతలు



కాళీనగర్‌లో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ట్రస్ట్ సభ్యులు



శివపురి కాలనీలో అక్షింతలను పంపిణీ చేస్తున్న నాయకులు

బండ్లగూడ: అయోధ్య రామమందిర అక్షింతలు ఎంతో పవిత్రమైనవని ప్రతి ఇంట్లో పూజ గదిలో వీటిని ఉంచవలసిన అవసరం ఉందని శ్రీ రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ సభ్యులు వెల్లడించారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఆహ్వానంతో పాటు రాములవారి పూజా అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాళీకానగర్‌లోని శ్రీ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ప్రతి ఇంటికి వెళ్లి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన ప్రతి ఒక్కరు తమతమ ఇళ్లను దీపాలతో అలంకరించి దీపావళి జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ అక్షింతల వితరణ

శంషాబాద్: అయోధ్య శ్రీరామ దివ్య అక్షింతల వితరణ కార్యక్రమం పట్టణంలో వైభవంగా సాగుతోంది. రామ సేవకులు ఆయా కాలనీల్లో అక్షిత వితరణ కార్యక్రమాన్ని భ క్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఎయిర్‌పోర్టు కాలనీ, మధురానగర్, ఆర్బీనగర్ తదితర కాలనీలో కార్యక్రమం కొనసాగింది.



శ్రీరాముని అక్షింతలు తీసుకోండి

మణికొండ: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను ప్రతి ఒక్కరు తీసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు సి. బీరప్ప అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని శివపురి కాలనీ, అమృతసాయి రెసిడెన్సీ, ఎస్ఎం సాయిహిల్స్‌లలో ప్రజలకు అక్షింతలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షింతలను తీసుకోవటంతో పాటు ఈ నెల 22వ తేదీన ప్రతి ఒక్కరు ఇంటిలో 5 దీపాలను వెలిగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, జి. దేవేందర్, ప్రధాన కార్యదర్శి ఎ. రామస్వామి, కె. కృష్ణ, కె. బాలకృష్ణ, శివగంగ, నాగిరెడ్డ, మధు, సత్యనారాయణ, శ్రీను, రవి, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూజిత అక్షితలను ఇంటింటికి పంపిణీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ టీచర్స్ కాలనీ కట్ట మైసమ్మ దేవాలయంలో గురువారం రాత్రి అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన పూజిత అక్షింతలకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయం కమిటీ సభ్యులతో పాటు వివిధ కాలనీలకు చెందిన ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పూజ కార్యక్రమం అనంతరం టీచర్స్ కాలనీలోని ఇంటింటికి పూజిత అక్షింతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



దేవాలయంలో పూజిత అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అక్షింతలను కాలనీలో ఇంటింటికి పంపిణీ చేస్తున్న భక్తులు

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కోసం ప్రజంతా దరఖాస్తులు చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ వెల్లడించారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ 20, 21వ డివిజన్‌లలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వార్డు సభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజలు పూర్తి సమాచారంతో కూడిన దరఖాస్తులను అందించాలన్నారు. అధికారులు వాటిని పరిశీలించి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను చేకూరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు అనితవెంకటేష్, సాగర్‌గౌడ్, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, డిఈ యాదయ్య, ఎస్.ఈ. శివానంద, ఏఈ రాజు, వార్డు ఇన్‌చార్జీ భాస్కర్, సరిత, గోపాల్‌ముదిరాజ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సెలెక్టెడ్ హోమ్ 'జీప్పీ సర్వీసు' ఆవిష్కరణ



లక్డీకాపూల్ : శంషాబాద్ ఎయిర్ పోర్ట్ స్టోర్ సెలెక్టెడ్ హోమ్ లో 'జీప్పీ సర్వీసు' ను ఆవిష్కరించారు. ప్రయాణికుల దుస్తుల అవసరాలను తీర్చడానికి ఈ ప్రత్యేకమైన సేవను అందిస్తుంది. మునుపెన్నడూ చూడని విధంగా వినూత్నమైన ఈ 'జీప్పీ సర్వీస్' బ్రాండ్ తో సంబంధం లేకుండా సహజమైన వస్త్ర సంరక్షణను అందించనుంది. ముఖ్యమైన సందర్భాలలో కస్టమర్లు తమ వస్త్రధారణ ప్రొఫెషనల్‌గా కనిపించడం కోసం ప్రత్యేకంగా రూపొందించిన బ్లేజర్ కవర్‌లలో కచ్చితమైన ప్యాకేజీలో అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రయాణ సౌలభ్యానికి అనువుగా ఉండడమే కాకుండా.. వేషధారణను మరింత పెంచుతుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు

సీఆర్ ఫౌండేషన్‌లో నైపుణ్య శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, ట్యాలీ, డీటీపీ శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. మహిళలు మొదట అడ్మిషన్ కొరకు రూ.150లు చెల్లించాలి. మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాలవారు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు కన్వీనర్ వనశ్రీ ఫోన్ : 9246530048కు సంప్రదించగలరు.

ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్

సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఉంది. మహిళల, కుటుంబ సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ కూడా తీసుకోవచ్చు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని 'న్యూ బిగెనింగ్' పేరిట ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మెడిటేషన్, స్ఫూర్తిదాయక చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నూతన సంవత్సర సంబరాలు చేసుకుంటారు. వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఎస్‌పీఐఈ ఫెలోగా ప్రొ.సోమ వేణుగోపాలరావు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సోమ వేణుగోపాలరావు సొసైటీ ఆఫ్ ఫొటోగ్రాఫిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్స్ (ఎస్‌పీఐఈ) ఫెలోగా ఎన్నికయ్యారు.ఈయన హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ప్రొఫెసర్. ఎస్‌పీఐఈ అనేది ఆప్టిక్స్, ఫొటోనిక్స్ టెక్నాలజీ అంతర్జాతీయ ప్రొఫెషనల్ సొసైటీగా గుర్తింపు పొందింది. 184 దేశాల నుంచి రెండున్నర లక్షలకుపైగా నిపుణులతో కూడిన గ్లోబల్ సంస్థగా పనిచేస్తోంది. కాగా ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

ఇనార్బిట్లో.. నేటి నుంచి 'బ్రాండ్' షో

సాక్షి సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఇనార్బిట్‌మాల్‌లో దేశంలోనే పేరొందిన ఫ్యాషన్ బ్రాండ్స్ ఉత్పత్తుల ప్రదర్శన శుక్రవారం నుంచి 3 రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని మాల్ ప్రతినిధులు తెలిపారు. జాక్ అండ్ జోన్స్, శంతను నిఖిల్, లెవిస్...తదితర 100కుపైగా విభిన్న రకాల బ్రాండెడ్ ఉత్పత్తులు ఈ ప్రదర్శనలో కొలువుదీరుతున్నాయని, వీటిని అనూహ్యమైన ఆఫర్లతో అందిస్తున్నామని వివరించారు.

రేపు మెగా జాబ్‌మేళా

గోల్కొండ: ఈనెల 6న మాసబ్‌ట్యాంక్‌లోని ఖాజామెన్షన్ ఫంక్షన్‌హాల్‌లో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ తెలిపారు. మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని పదోతరగతి నుంచి డిప్లొమా, ఇంజనీరింగ్ పూర్తిచేసిన వారు ఈ జాబ్‌మేళాలో రావాలని సూచించారు. 13 వేల ఉద్యోగాల భర్తీ ఈ జాబ్‌మేళా ద్వారా జరుగుతుందని, వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి సెలెక్ట్ అయిన వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తారని ఆయన తెలిపారు.

బొడ్రాయి ఆవిష్కరణకు కేంద్రమంత్రికి ఆహ్వానం



గోల్కొండ: ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ తదితర విషయాల్లో తాను అన్ని రకాలుగా ఆలయ నిర్వాహకులకు సహకారం అందిస్తానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ హనుమాన్ ఆలయం వద్ద పునర్నిర్మించిన బొడ్రాయి ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలని కోరుతూ ఆలయ ప్రతినిధులు గురువారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. సందేష్‌యాదవ్, రాధాకృష్ణయాదవ్, దేవర వంశీ, ప్రవీణ్, అరవింద్, శ్రీకాంత్‌సాగర్ తదితరులున్నారు.

వచన కవిత అధ్యయన శిబిరం

సుల్తాన్‌బజార్ : తెలంగాణ సారస్వత పరిషత్తు ఇటీవల నిర్వహించిన యువ రచయిత్రుల సమ్మేళనానికి కొనసాగింపుగా ఫిబ్రవరి 11న యువ కవయిత్రులకు వచన కవిత్వంలో అధ్యయన శిబిరం నిర్వహించాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లో అబిడ్స్ తిలక్‌రోడ్డులోని పరిషత్ ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు సాగే ఈ శిబిరంలో కవిత్వ భాషాశైలి, శీర్షిక, వస్తువు, శిల్పం, ఎత్తుగడ, నిర్వహణ, ముగింపు మొదలైన అంశాలపై ప్రముఖ కవులు, విమర్శకులు శిక్షణను ఇస్తారు. యువ రచయిత్రుల సమ్మేళనంలో పాల్గొన్న కవయిత్రుల్లో సుమారు 50 మందిని వారి కవితల ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఇటీవల రాసిన స్వీయ కవితను, ఇతర వివరాలతో దరఖాస్తు పంపితే ఎంపిక చేస్తామని పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య ప్రకటించారు. 96037 27234 వాట్సాప్ నంబరుకు తమ కవితలను ఈనెల 12 లోగా పంపాలని స్పష్టం చేశారు.